సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు

బస్సులు, రైళ్లు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు అమాంతం పెంచేసి ప్రయాణికులను దోచేస్తున్నాయి. IIలో



సింహగిరిపై శంఖుచక్రనామాలు IIలో



ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు IIలో

న్యూస్‌రీల్

విజయవాడకు కొత్త విమాన సర్వీసులు



గోపాలపట్నం: విశాఖ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి విశాఖకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానయాన సంస్థ ఈ నెల 27 నుంచి రెండు కొత్త సర్వీస్‌లను ప్రారంభించనుంది. అలాగే 29న ఇదే సంస్థ విజయవాడ నుంచి విశాఖకు మరో సర్వీస్ ప్రారంభించనుంది. ఇందులో ఓ సర్వీస్ వారం రోజులూ అందుబాటులో ఉంటుంది. ఇది విజయవాడ నుంచి విశాఖకు ఉదయం 10.35 గంటలకు వచ్చి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుంది. మరో సర్వీస్ విజయవాడ నుంచి రాత్రి 8.55 గంటలకు విశాఖ చేరుకుని.. రాత్రి ఒంటి గంటకు విజయవాడ బయలుదేరుతుంది. ఇది సోమ, బుధ, శుక్ర, ఆది వారాల్లో అందుబాటులో ఉంటుంది. 29వ తేదీ నుంచి ఓ విమానం రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుని తిరిగి రాత్రి ఒంటి గంటకు విజయవాడ బయలుదేరుతుంది. మంగళ, గురు, శని వారాల్లో ఈ సర్వీస్ అందుబాటులో ఉంటుందని విమానయాన సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డీగా శాంతిప్రభ



మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ అధికారి(ఆర్‌డీ)గా డాక్టర్ ఎం.శాంతి ప్రభ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌డీగా ఉన్న డాక్టర్ రాధారాణి 45 రోజులు సెలవు పెట్టారు. దీంతో జోనల్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న శాంతి ప్రభను ఇన్‌చార్జి ఆర్‌డీగా నియమించారు.

15న కేంద్ర సహాయమంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఈనెల 15న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఆ రోజు ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను సందర్శన అనంతరం సాయంత్రం 6.55 గంటలకు విమానంలో గన్నవరం వెళతారు.

'హనీట్రాప్ కేసు'లో ముగిసిన జెమీమా కస్టడీ

తగరపువలస: హనీట్రాప్ కేసుకు సంబంధించి మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీమా ఒక్కరోజు కస్టడీ ముగిసింది. భీమిలి పోలీస్ స్టేషన్‌లో గురువారం భీమిలి సీఐ బి.సుధాకర్, కంచరపాలెం, దువ్వాడ సీఐలు చంద్రశేఖర్, మల్లేశ్వరరావు ఆమెను విచారించి కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. జెమీమా నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్, ఫోన్లను ఓపెన్ చేయించి.. అందులో హనీట్రాప్ ముఠాకు సంబంధించిన మూలాలు, మిగిలిన బాధితులకు సంబంధించిన సమాచారం సేకరించినట్టు సమాచారం. బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నందున వీటిని బయటపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి రావడంతో పాటు హనీట్రాప్‌లో కీలక వ్యక్తులు చిక్కుకున్నట్టు తెలిసింది. గురువారం న్యాయస్థానం ద్వారా జెమీమాను తిరిగి సెంట్రల్ జైలుకు తరలించారు. కంచరపాలెం, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా వారు మళ్లీ నిందితురాలిని కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది.

ఎలాగైనా ఫిక్స్ చేయాల్సిందే!

అంతా సక్రమమని నివేదిక ఎలా ఇస్తారంటూ జిల్లా అధికారులకు క్లాస్

రైతుల నుంచి ఫిర్యాదు తీసుకోవాల్సిందేనని ఆదేశాలు

తప్పు జరిగిందని ఆధారాలు చూపేలా మరోసారి అధికారుల విచారణ

ఫ్రీ హోల్డ్ భూములపై ఉన్నతాధికారుల ఒత్తిడి



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా మారింది జిల్లాలోని అధికారుల పరిస్థితి. టీడీపీ నేతలు అడ్డగోలుగా చేసిన భూ ఆరోపణలను ఎలాగైనా నిరూపించాలంటూ ఒత్తిళ్లు రావడంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఇరవై ఏళ్లు దాటిన తర్వాత అసైన్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ చేసి రైతులకు అధికారాలు అప్పగించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందులో భారీగా అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు విమర్శించగా.. పచ్చ పత్రికలు ఎడాపెడా వార్తలను కుమ్మరించాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారుల కమిటీతో విచారణ జరిపించింది. ఈ కమిటీ ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంలో అక్రమాలు జరగలేదని... అంతా నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో అక్రమాలు జరగలేదని నివేదిక ఎలా ఇస్తారని జిల్లా ఉన్నతాధికారులను అమరావతి స్థాయి నుంచి క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. కనీసం ఒక రైతు నుంచైనా ఫిర్యాదు తీసుకుని విచారణ చేసి... అక్రమాలు జరిగాయనేలా నివేదిక తయారుచేయాలని స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు మరోసారి ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ ప్రారంభించారు. ఫలితంగా మా చెల్లి పెళ్లి.. జరగాలి మళ్లీ మళ్లీ.. అన్న చందంగా తయారయింది ఈ ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారం.

ఇదీ జరిగింది...!

వాస్తవానికి 1954కు ముందు ఉన్న అసైన్డ్ భూములను మాత్రమే విక్రయించుకునే అవకాశం ఉండేది. అయితే రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ద్వారా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేయించింది. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై రైతులకు సర్వహక్కులు కల్పిస్తూ జీవో నెంబరు 596 జారీ చేసింది. 2003కు ముందు రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములను విక్రయించుకునే అధికారం లభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు 20 సంవత్సరాలు దాటిన అసైన్డ్ భూములు ఆటోమేటిక్‌గా ఫ్రీ హోల్డ్ అయ్యేలా కూడా నిబంధనలను రూపొందించింది. తద్వారా తమ భూములను విక్రయించుకునేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలంటూ రెవెన్యూ యంత్రాంగం చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి లేకుండా చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలో కూడా 609 ఎకరాలను మాత్రమే ఫ్రీ హోల్డ్ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైతుల నుంచి మంచి స్పందన రావడంతో అప్పట్లో తెలుగుదేశం నేతలు జీర్ణించుకోలేక అక్రమాలు జరిగాయంటూ విమర్శలు గుప్పించారు. ఇందుకు తానాతందానా అంటూ పచ్చ పత్రికలు కూడా భారీగా అక్రమాలు జరిగాయని అభూత కల్పనలను ప్రచారం చేశాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది.



అక్రమాలు లేవు.. అంతా సక్రమమే..!

జిల్లాలో మొత్తం 609 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేయగా.. ఇందులో 190 ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఫ్రీ హోల్డ్ చేసిన భూములు.. ఆనందపురం మండలంలో 407.77 ఎకరాలు, భీమిలిలో 52.51 ఎకరాలు, పద్మనాభం మండలంలో 129.60 ఎకరాలు, పెందుర్తి మండలంలో 20.04 ఎకరాలు ఉన్నాయి. ఈ అన్ని భూములపై డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ విచారణ జరిపింది. స్థానికంగా ఆయా గ్రామాలకు వెళ్లి మరీ రైతులను విచారించింది. ఎక్కడా అక్రమాలు జరగలేదని అధికారులకు స్పష్టత వచ్చింది. రైతులు కూడా తమను ఎవరూ బెదిరించలేదని స్పష్టం చేశారు. ఎవరైనా ఫిర్యాదులను తమకు కానీ తహసీల్దారు కార్యాలయంలో కానీ అందజేయాలని ఈ కమిటీ కోరింది. అంతేకాకుండా ఫ్రీ హోల్డ్ చేసే వ్యవహారంలో అంతా నిబంధనల మేరకు జరిగిందా లేదా అనే విషయాన్ని కూడా ఈ కమిటీ విచారించింది. అంతా పక్కాగా నిబంధనల మేరకే జరిగిందని తేలడంతో అదే విషయాన్ని ఈ కమిటీ తన నివేదికలో పేర్కొంది.

అక్రమమని నిరూపించాలంట..?

అధికారుల కమిటీ విశాఖలోని భూ వ్యవహారాల్లో అక్రమాలు జరగలేదని తేల్చడంతో కుడితిలో పడ్డ ఎలుకలా ప్రభుత్వ పెద్దల పరిస్థితి తయారైంది. ఈ నేపథ్యంలోనే అక్రమాలు జరగలేదని ఎలా తేలుస్తారంటూ జిల్లా యంత్రాంగంపై అమరావతి స్థాయి నుంచి ప్రశ్నల పరంపర కురిపిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఎలాగైనా అక్రమాలు జరిగాయని ఆధారాలు చూపించాల్సిందేనని జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నియమించిన కమిటీ కావడంతో.. తమ ప్రచారమంతా అబద్ధమని తేలిపోతుందనే భయం టీడీపీ నేతలకు, పచ్చ పత్రికలకు వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం భీమిలి మండలం అన్నవరం గ్రామంలో ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. రెవెన్యూ రికార్డులను కూడా పరిశీలించారు.



భీమిలి మండలం అన్నవరంలో ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

'కనక'పరమేశ్వరి

బంగారు చీర, కిరీటం, రూ.4 కోట్ల కరెన్సీతో అలంకరణ



బంగారు చీరలో మెరిసిపోతున్న కన్యకా పరమేశ్వరి

దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మ వారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం, తేనె వంటి 108 రకాల ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేకాభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో శ్రీమహాలక్ష్మి రూపంలో సుందరంగా అలంకరించారు. 108 స్వర్ణపుష్పాలతో నివేదించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుమారు ఆరు కిలోల స్వర్ణాభరణాలు, బంగారు చీర, బంగారు కిరీటంతో అలంకరించారు. గర్భగుడిని బంగారు బిస్కెట్లు, 10 కిలోల వెండి వస్తువులు, వెండి బిస్కె ట్లతో పాటు నాలుగు కోట్ల విలువ చేసే రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 కరెన్సీ నోట్లతో తీర్చిదిద్దారు. శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతార రూపంలో కరెన్సీ నోట్లు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించడం 22 ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అందించిన సొమ్ముతో ఈ అలంకరణ చేశామని.. ఒక రోజు తర్వాత ఆ సొమ్మును భక్తులకు తిరిగి అందజేస్తామన్నారు. అనంతరం దేవస్థాన ఆస్థాన మండపంలో మహిళా విభాగం సభ్యులు దేవీ భాగవతం, బాలా త్రిపుర సుందరి దేవి జపం, లలితా సహస్రనామం సామూహిక పారాయణం చేశారు. సాయంత్రం ఆస్థాన ప్రధానాచార్యుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ నేతృత్వంలో 200 మంది మహిళలతో సామూహిక అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు.



సామూహిక అష్టలక్ష్మి పూజల్లో పాల్గొన్న మహిళలు

గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి గురువారం గజలక్ష్మిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష గాజులతో పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలను లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు అందజేశారు.

విశాఖ మదిలో రతన్ టాటా స్మృతులు

వచ్చింది ఒక్కసారే అయినా విశాఖ వాసులకు చిరస్మరణీయమైన గురుతులెన్నో మిగిల్చారు రతన్ టాటా. పేదలకు సేవలందించడంలో ఎప్పుడూ ముందుండే ఆ మానవతామూర్తి, దివంగత వైఎస్సార్ చేసిన విజ్ఞప్తితో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కోరడంతో టీసీఎస్ ఏర్పాటుకూ సుముఖత వ్యక్తం చేశారు. ఆ సేవాతత్పరుడు ఇక లేరన్న నిజాన్ని విశాఖవాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. కంటిచూపుతో అంతటి వ్యాపార సామ్రాజ్యాన్ని శాసించే ధీశాలి.. నిరాడంబరంగా జీవించిన విధానాన్ని తలచుకుని నివాళులర్పిస్తున్నారు.



ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రతన్ టాటా (ఫైల్)

- 2018లో ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి రతన్ టాటా హాజరు
- దివంగత సీఎం వైఎస్సార్ విజ్ఞప్తి మేరకు అగనంపూడిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు
- గత సీఎం జగన్ చొరవతో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుకు సుముఖత

విశాఖ సిటీ: దిగ్గజ పారిశ్రామిక వేత్త.. దార్శనికుడు.. గొప్ప మానవతావాది.. అభినవ కర్ణుడు.. అజాతశత్రువు.. రతన్ నవల్ టాటాకు విశాఖతో కూడా అనుబంధం ఉంది. ఆయన నగరానికి కేవలం ఒక్కసారే వచ్చినప్పటికీ.. ఇక్కడి అందాలకు మంత్రముగ్ధులయ్యారు. ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పలు రంగాల్లో పరిశోధనలకు ఆలోచనలు చేశారు. దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రధానంగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేందుకు అగనంపూడిలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. దేశ పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపిన ధీశాలి రతన్ టాటా.. అనారోగ్యంతో ముంబై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో విశాఖలో ఆయన చేసిన పర్యటన.. విశాఖ అందాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అప్పటి ఆయన రాకను గుర్తు చేసుకుంటూ ఆయన మాటలను అనేక మంది బాధాతప్త హృదయాలతో నెమరువేసుకుంటున్నారు.

విశాఖపై ముద్ర

రతన్ టాటా ఒకే ఒకసారి విశాఖకు వచ్చారు. నగరంలో కొన్ని గంటల పాటు పర్యటించి ఇక్కడి అందాలకు ఫిదా అయిపోయారు. 2018, డిసెంబర్ 10వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రతన్ టాటా తొలిసారిగా విశాఖలో అడుగుపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలో పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఏయూలో జరిగిన కార్యక్రమానికి హాజరై విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. రతన్ టాటా వస్తున్నట్లు తెలుసుకున్న ఏయూ పూర్వ విద్యార్థులు ఎప్పుడూ లేని విధంగా ఈ కార్యక్రమానికి పోటెత్తారు. 6 వేల మంది పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఏయూ విద్యార్థులు కూడా వేల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటలకు విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఏయూ ప్రాశస్త్యం, ఔన్నత్యం పూర్తిగా తెలియనప్పటికీ.. ఇక్కడకు వచ్చాక యూనివర్సిటీ ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. 'ఆంధ్రా యూనివర్సిటీతో కలిసి ఏం చేయాలో అన్వేషించాలనుకుంటున్నాను. డేటా అనలిటిక్స్, హ్యూమన్ జెనోమిక్ సీక్వెన్సింగ్, ప్రెడిక్టివ్ బిజినెస్ రంగాల్లో టాటా గ్రూప్, ఏయూ మధ్య అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తాను విశాఖలో కొద్ది గంటలే పర్యటించినప్పటికీ.. నగరం ఆకట్టుకుందని కితాబిచ్చారు. ఈ మాటలకు ఆ సభ హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

నాడు తండ్రి.. నేడు కొడుకు విజ్ఞప్తుల మేరకు..

ముంబై కేంద్రంగా ఉన్న తన వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రపంచంలో అనేక దేశాల్లో విస్తరించిన రతన్ టాటా విశాఖలో మాత్రం క్యాన్సర్ రోగుల కోసం ఆస్పత్రిని నెలకొల్పారు. 2004-09 మధ్య అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విశాఖలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని రతన్ టాటాను విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం అగనంపూడిలో స్థలాన్ని కూడా కేటాయించారు. దీంతో వైఎస్సార్ మరణం తరువాత కూడా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఇప్పుడు వేలాది మంది క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తోంది. అలాగే 2019-24 మధ్య గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విశాఖలో ప్రతిష్టాత్మకమైన టీసీఎస్ సంస్థను ఏర్పాటు చే యాలని కోరారు. దీనికి కూడా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఆ చొరవ కారణంగానే ప్రస్తుతం విశాఖలో టీసీఎస్ అడుగులు పడబోతున్నాయి. తాజాగా ప్రభుత్వం మారినప్పటికీ.. విశాఖలో టీసీఎస్ సంస్థ ఏర్పాటు విషయంపై ప్రస్తుత రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా బుధవారమే ప్రకటించారు. అదే రోజు సాయంత్రం రతన్ టాటా కన్నుమూశారు. రతన్ టాటాకు విశాఖతో దీర్ఘకాల అనుబంధం లేకపోయినప్పటికీ.. ఇక్కడ ఐటీ సేవలు విస్తరించడానికి అడుగులు పడుతున్న సమయంలో మరణించడం బాధాకరం.

'కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు వ్యతిరేకం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్ల దక్షిణ భారతదేశ అధ్యయన యాత్రను కార్పొరేటర్లు బి.గంగారావు, మూర్తి యాదవ్ వ్యతిరేకిస్తూ జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. జీవీఎంసీ 98 వార్డుల్లో వీధి దీపాలు వెలగని పరిస్థితి ఉందని, నాణ్యమైన రోడ్లు లేవని.. ఈ పరిస్థితుల్లో విహార యాత్ర ఎందుకని మూర్తి యాదవ్ ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధ్యయన యాత్ర చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గతంలో కార్పొరేటర్లు అధ్యయన యాత్రలు చేశారని.. ఆ తర్వాత వాటిపై ఎటువంటి చర్చ జరగలేదని బి.గంగారావు అన్నారు. ప్రజలకు ఉపయోగపడని ఈ యాత్రను కౌన్సిల్ సభ్యులందరూ బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు



- టికెట్ ధరపై రెండు మూడు రెట్ల వసూళ్లు
- రైళ్లు ఫుల్.. ఏసీ కోచ్‌ల్లోనూ కిటకిట
- పెరిగిన రద్దీకనుగుణంగా బస్సులు వేయని ఆర్టీసీ
- 10 ప్రత్యేక రైళ్లు వేసినా విశాఖ ప్రయాణికులకు దూరమే..
- 8 రైళ్లు దువ్వాడ బైపాస్ మీదుగానే ప్రయాణం
- రద్దీ దృష్ట్యా విమాన చార్జీలూ రెట్టింపు



ప్రయాణికులతో కిక్కిరిసిన రైల్వే స్టేషన్

సాక్షి,విశాఖపట్నం: దసరా పండగ వేళ రాకపోకలు ఊపందుకున్నాయి. ప్రణాళిక ప్రకారం ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్న వారు కొందరైతే.. అప్పటికప్పుడు ప్రయాణాలకు సిద్ధమవుతున్న వారు మరికొందరు. ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు అమాంతం పెంచేసి దోచేస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్‌ను సంప్రదించిన ప్రయాణికులకు తొలుత సీట్లు లేవంటూ బెంబేలెత్తించి.. చివరి నిమిషంలో డబుల్ రేట్లతో షాక్‌కు గురిచేస్తున్నాయి. మరో వైపు రైళ్లు కూడా కిక్కిరిసిపోతున్నాయి. విమాన చార్జీలూ రెట్టింపయ్యాయి. అవసరానికి తగ్గట్లుగా ప్రత్యేక రైళ్లు వేయకపోవడం.. వేసిన స్పెషల్ రైళ్లు బైపాస్ మీదుగా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు ఉసూరంటూ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దసరా రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ కూడా స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయడంలో విఫలమైంది.

'ప్రత్యేక'ఏర్పాట్లు అంతంతమాత్రమే..

ఏటా దసరా సందర్భంగా ఆర్టీసీ, రైల్వే అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతుంటారు. ఈసారి రద్దీని ముందుగానే అంచనా వేయడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా తక్కువ సర్వీసులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దసరా సెలవులకు నగరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ బస్సులకు ఎక్కువ డిమాండ్ ఉండటంతో ఆయా రూట్లలో ప్రత్యేక బస్సుల సంఖ్య పెంచడంలో విఫలమయ్యారు. విశాఖ రీజియన్ నుంచి రెగ్యులర్‌గా తిరిగే వాటితో పాటు అదనంగా గతేడాది మాదిరిగానే 200 బస్సులు నడుపుతున్నారు. విజయవాడకు 40, హైదరాబాద్‌కు 40, కాకినాడ-రాజమండ్రి రూట్లలో 40 బస్సులతో పాటు ఉత్తరాంధ్ర, బెంగళూరు, చెన్నై, అమలాపురం, నరసాపురం, భీమవరం తదితర దూర ప్రాంత బస్సులకు తక్కువగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

బైపాస్‌లోనే బైబై చెప్పేలా..

మరోవైపు ఈస్ట్ కోస్ట్ రైల్వే వివిధ ప్రాంతాలకు 10 రైళ్లను నడుపుతోంది. ఇందులో 8 రైళ్లు విశాఖకు రాకుండా దువ్వాడ మీదుగా రాకపోకలు సాగించేలా చేయడంతో.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైళ్లలోని జనరల్ బోగీల్లో అడుగు కూడా వేయలేని పరిస్థితి ఉండటంతో.. ఫైన్లు కట్టి మరీ రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణాలు చేస్తున్నారు. స్లీపర్ క్లాస్‌లే కాకుండా.. ఏసీ బోగీలూ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.

రెండు రెట్లు ప్రైవేట్ బాదుడు

దసరా పండగను సొంతూరిలో చేసుకోవాలన్న ప్రజల సెంటిమెంట్‌ను ప్రైవేటు ట్రావెల్స్ తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారి నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు సాధారణ రోజుల్లో హైదరాబాద్‌కు రూ.700 నుంచి రూ.900 వరకూ ఏసీ సర్వీసులకు టికెట్ వసూలు చేసిన ప్రైవేట్ ట్రావెల్స్.. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఏకంగా రూ.1800, రూ.2,678, రూ.3000 వరకు వసూలు చేస్తున్నాయి. ఇక విజయవాడకు రూ.1,800, రూ.2,550, రూ.2,670 వరకు చార్జీలు బాదుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు సైతం రెట్టింపు భారాన్ని మోస్తూ.. ఊళ్లకు వెళ్తున్నారు.

విమానాలకూ పెరుగుతున్న గిరాకీ

మరోవైపు.. విమానాల్లో కూడా పయనమవుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నుంచి విశాఖ వచ్చే ప్రజలు ఎక్కువగా ఉన్నారు. దసరా కావడంతో వివిధ విమాన సర్వీసులు టికెట్ ధరను రెట్టింపు చేసేశాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చేందుకు సాధారణ రోజుల్లో సుమారు రూ.3 వేల వరకూ టికెట్ ధర ఉండగా.. ప్రస్తుతం రూ.5000, రూ.7,000 వరకు ధర చెల్లించాల్సిందే. అయితే బస్సులకు రూ. 3 వేల వరకూ చెల్లించి గంటల తరబడి ప్రయాణం చేసే బదులు మరికొంత డబ్బు చెల్లించి తక్కువ ప్రయాణ సమయంలో ఇళ్లకు చేరుకోవచ్చని చాలా మంది విమానాలను ఆశ్రయిస్తున్నారు. మొత్తంగా పండగ సందడంతా ప్రయాణాల్లో కనిపిస్తోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయం ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

8 ప్రైవేట్ బస్సుల సీజ్

గోపాలపట్నం: దసరా నేపథ్యంలో ప్రైవేటు బస్సుల్లో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎన్ఏడీ జంక్షన్, గంభీరం, అగనంపూడి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి.. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న 8 బస్సులను సీజ్ చేశారు. తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, మాధవి, రాజారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల లోడుతో లారీ బోల్తా



శొంఠ్యాం శివారు జాతీయ రహదారిపై బోల్తా పడిన ఉల్లి బస్తాల లారీ

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం శివారు ఎస్‌జీఆర్ పురం జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ఉల్లిపాయల లోడులో లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి కోల్‌కతాకు వెళ్తున్న ఈ లారీ.. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌పైకి దూసుకుపోయింది. 50 మీటర్ల వరకు ముందుకు వెళ్లిన తర్వాత రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. సంఘటన స్థలానికి ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు చేరుకుని రెండు క్రేన్ల సాయంతో లారీని తొలగించారు. మరో వాహనంలోకి ఉల్లిపాయలను లోడ్ చేసి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు నిందితుడి అరెస్ట్



నిందితుడితో ఆర్పీఎఫ్ పోలీసులు

తాటిచెట్లపాలెం: ఓ కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మర్రిపాలెం రైల్వే భద్రతా దళం, మర్రిపాలెం పోస్టులో 2022లో జరిగిన నేరంతో సంబంధం ఉన్న కంచరపాలేనికి చెందిన అగ్రహారపు గౌరీకాంత్ అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం గురువారం ఎస్ఐ మమతానాయక్, హెడ్ కానిస్టేబుళ్లు టి.సురేష్‌కుమార్, బడే మహేష్ నిందితుడిని మర్రిపాలెం రైల్వే పోస్ట్ పరిధిలో అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

16న 'నర్సుల సంఘం' నామినేషన్ల స్వీకరణ

మహారాణిపేట: ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16న నామినేషన్లు స్వీకరిస్తారని సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.ఎస్.నిర్మల కుమారి తెలిపారు. నాలుగేళ్ల విరామం తర్వాత కార్యవర్గ ఎన్నికలు జరుగుతున్నట్లు చెప్పారు. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ, 23న పోలింగ్ ఉంటుందన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారని, 24న రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందన్నారు. ఆ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని వివరించారు.

కాపర్ సామగ్రి చోరీలో 12 మంది అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని పలు కంపెనీల్లో 880 కిలోల కాపర్ సామగ్రి అపహరణ కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు క్రైం విభాగం ఏసీపీ వెంకటరావు వెల్లడించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుర్రంపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని పలు కంపెనీల్లో దాదాపు రూ.12 లక్షల విలువ చేసే 880 కిలోల కాపర్ సామగ్రిని నిల్వ చేశారు. ఈ నెల 4న ఆయా ప్రాంతంలో చెత్త ఏరుకునే 12 మంది వ్యక్తులు ఆయా ప్రాంతంలో సంచరించారు. ఆయా సామగ్రిని వారు దొంగిలించినట్లు తమ విచారణలో తేలడంతో వారిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు.

ఫోర్జరీ కేసులో బీజేపీ నేత అరెస్ట్

భీమునిపట్నం: డాక్యుమెంట్ ఫోర్జరీ కేసులో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు కోడూరి సంజీవరావు, ఆయన తండ్రి కోడూరి రామారావును గురువారం భీమిలి పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారంలో 2021లో స్థల వివాదానికి సంబంధించి డాక్యుమెంట్లు ఫోర్జరీ చేసినట్లు వారిపై కేసు నమోదైంది.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు







విశాఖ స్పోర్ట్స్: శివాజీ పార్క్‌లోని రింక్‌పై విశాఖ స్కేటర్లు రయ్‌మంటూ దూసుకుపోయారు. రాష్ట్ర జట్టు ఎంపికలో భాగంగా ఇక్కడ ఆర్టిస్టిక్, స్పీడ్, రింక్ రేస్‌లు ఉత్కంఠగా సాగుతున్నాయి. గురువారం జరిగిన ఆర్టిస్టిక్ పోటీల్లో సోలోతో పాటు పెయిర్ అంశాల్లో స్కేటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీఎంఆర్డీఏ పార్క్‌లోని బాంక్‌డ్ రింక్‌లో స్పీడ్‌తో పాటు రేస్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

ఫన్ అండ్ థ్రిల్

- పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్
- పోర్టు స్టేడియం వేదికగా ఎన్నో రకాల ఫన్, అడ్వెంచర్ గేమ్స్
- రాష్ట్రంలోనే అతి పెద్ద స్నో వరల్డ్



మంచును తలపిస్తున్న స్నో వరల్డ్



వాటర్ పార్క్‌లో విభిన్నమైన స్లైడింగ్స్

సీతంపేట: హిమపాతంలో కేరింతలు కొట్టాలంటే సిమ్లా వెళ్లనక్కర్లేదు. నగరంలోని పోర్టు స్టేడియంకు వెళితే చాలు. రాష్ట్రంలో మొదటిసారి సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతి పెద్ద స్నో వరల్డ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. 30 వేల చదరపు అడుగుల విస్తీరణంలో విభిన్నమైన స్లైడ్స్‌తో వాటర్ పార్క్ అలరిస్తోంది. 15వేల అడుగుల విస్తీర్ణంలో ఫన్ జోన్ ప్రత్యేక ఆకర్షణ. ఉదయం నుంచి రాత్రి వరకు పిల్లలు, పెద్దలు అన్ని వయసుల వారు ఇక్కడ ఉన్న గేమ్స్‌తో ఫన్ , థ్రిల్లింగ్ పొందడం ఖాయం. అలాగే విశాలమైన రెస్టారెంట్‌లో ఫుడ్‌జోన్, అత్యాధునిక జిమ్ అందుబాటులో ఉంది. నేటి తరం యూత్ కోరుకునే ఫన్, థ్రిల్లింగ్ అండ్ అడ్వెంచర్, ఎమ్యూజ్‌మెంట్‌ను అందుబాటులోకి తెచ్చి, ఏడాది కాలంలోనే విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ విశేష గుర్తింపు పొందింది. పర్యాటక రంగం అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 'యునిక్ టూరిజం ప్రాజెక్టు' గా విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ గుర్తించింది. ఇటీవల సీఎం చంద్రబాబు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా విశ్వనాథ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బొడ్డేటి కాశీవిశ్వనాథం ఈ అవార్డు అందుకోవడం విశేషం

ఒకేచోట 19 రకాల ఫన్ గేమ్స్

రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ 19 రకాల ఫన్ గేమ్స్ ఒకే చోట అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో అతిపెద్ద స్నో వరల్డ్ , వాటర్ పార్క్, గో కార్టింగ్, అతిపెద్ద ఫన్ జోన్, ట్రాప్లిన్ పార్క్, అధునాతన స్విమ్మింగ్ పూల్, 12డీ థియేటర్, లేజర్ వార్స్, 360 డిగ్రీస్ సైక్లింగ్, బంగీ జంప్, రాకెట్ ఎజెక్టర్, కిడ్స్ ఫొటో స్టూడియో, సాఫ్ట్ ప్లే ఏరియా, డాషింగ్ కార్స్, ఆర్కేడ్ గేమ్స్, లైవ్ యాక్షన్ క్రికెట్ ఇలా ఎన్నో రకాల గేమ్స్ అన్నీ ఒకేచోట కొలువుదీరాయి.

క్రీడలకు ప్రాముఖ్యత

ఫన్ అండ్ థ్రిల్లింగ్‌తో పాటు క్రీడలకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చేలా క్రికెట్, బాక్స్ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, త్రో బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, కరాటే, టైక్వాండో ఆడేందుకు పోర్టు స్టేడియంలో అన్ని సదుపాయాలు కల్పించారు. అధునాతన జిమ్ ఏర్పాటు చేయడమే కాక, పిల్లలకు చిన వయస్సు నుంచే క్రీడల్లో రాణించేలా నిపుణుల చేత శిక్షణ ఇస్తున్నారు. మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, ఒకేసారి 160 మంది కూర్చునే విధంగా ఏసీ రెస్టారెంట్ అందుబాటులో ఉన్నాయి. 1,500 సీటింగ్‌తో కళావాణి ఆడిటోరియాన్ని ఆధునీకీకరించారు.

టూరిజంకు పరిశ్రమ హోదా ఇవ్వాలి

లీజుకు తీసుకున్న ఏడాదికాలంలో నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పోర్టు స్టేడియాన్ని తీర్చిదిద్దాం. రాష్ట్రంలోనే అతిపెద్ద స్నో వరల్డ్, వాటర్ పార్క్, 19 రకాల ఫన్ అండ్ థ్రిల్లింగ్ అడ్వెంచర్ గేమ్స్ ఒకేచోట ఏసీ రూఫ్ కింద ఏర్పాటు చేశాం. ఒక పక్క క్రీడలు, మరో వైపు ఫన్ గేమ్స్ అందుబాటులోకి తీసుకొచ్చి 225 మందికి ఉపాధి కల్పించాం. ప్రభుత్వం టూరిజంకు పరిశ్రమ హోదా కల్పిస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తాం . భారతదేశంలోనే మొదటి సారిగా మీనియేచర్ పార్కును త్వరలో అందుబాటులోకి తెస్తాం.

– బొడ్డేటి కాశీ విశ్వనాథం, చైర్మన్, విశ్వనాథ గ్రూప్ ఆఫ్ కంపెనీస్

సింహగిరిపై శంఖు చక్రనామాలు

- పదేళ్ల అనంతరం నవ్య కాంతులతో దర్శనం
- రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన జీఆర్‌టీ జ్యూయలర్స్

సింహాచలం: సింహగిరిపై మైక్రోటవర్‌కి వెళ్లే దారిలో కొండపై నూతనంగా ఏర్పాటు చేసిన శంఖుచక్రనామాలు గురువారం నుంచి కనువిందు చేస్తున్నాయి. నగరంలోని జీఆర్‌టీ జ్యూయలర్స్ రూ.75 లక్షలతో వీటిని ఏర్పాటు చేసింది. 36 అడుగుల ఎత్తు, వంద అడుగుల వెడల్పు మేర ఏర్పాటు చేసిన నూతన శంఖు చక్రనామాలు సింహాచలంతో పలు ప్రాంతాల వారికి కూడా కనిపించే విధంగా ఏర్పాటు చేశారు. బలమైన గాలులు, హుద్ హుద్ వంటి తుపానులను సైతం తట్టుకుని ఉండేలా రూపొందించారు. సరిగ్గా పదేళ్ల అనంతరం మళ్లీ సింహగిరిపై నూతన శంఖుచక్రనామాలు దర్శనమిస్తున్నాయి. 2014లో ఏర్పడ్డ హుద్‌హుద్ కారణంగా సింహగిరిపై టీవీ టవర్ వద్ద ఉండే శంఖుచక్రనామాలు నేలకొరిగాయి. మళ్లీ వాటిని ఏర్పాటు చేసేందుకు దేవస్థానం ఆసక్తి చూపలేదు. గత ట్రస్టుబోర్డులో సభ్యులు పదేపదే దేవస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో దేవస్థానం దాతల సహకారంతో నూతన శంఖుచక్రనామాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక చేసింది. జీఆర్‌టీ జ్యూయలర్స్ ముందుకు రావడంతో వారి సహకారంతో ఇన్నేళ్లకు మళ్లీ శంఖుచక్రనామాల దర్శనం కలిగింది.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00

ఆల్ట్రా వయొలెట్ ఈవీ బైక్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న వ్యాపారవేత్త మల్లిక్

సీతంపేట: శంకరమఠం రోడ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ట్రా వయొలెట్ బైక్ షోరూంను గురువారం ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల మల్లిక్ ప్రారంభించారు. యువత అభిరుచికి తగినట్టు మంచి బ్యాటరీ బ్యాకప్‌తో 250 సీసీ నుంచి 300 సీసీ కెపాసిటీలో ఆకర్షణీయమైన మోడల్స్‌లో ఈ బైక్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రహ్మణ్యం, నిరాజ్ రాజ్మోహన్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.76,640
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.70,350
వెండి(కిలో):	రూ.1,00,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240